### ధరలను అదుపు చేయాలి

ప్రస్తుతం మార్కెట్‌లో అన్ని రకాల నిత్యావసరాల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏది కొనాలన్నా కిలోకు రూ. 60 పైగానే ఉన్నాయి. కిలో కొనే చోట పావుకిలోతో సరి పెట్టుకోవాల్సి వస్తున్నది. పప్పులు, పిండి, నూనెతో పాటు బియ్యం ధరలు కూడా అదే మాదిరిగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి నిత్యావసర ధరలను నియంత్రించాలి.

**-కారు చెన్నయ్య, బోడంపహాడ్, షాబాద్**





# ధరల దరువు..

## భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు

- ఏడాదిలో 50 శాతం పెరిగిన కంది పప్పు
- సన్న బియ్యానికీ రెక్కలు..

# బతుకులు బరువు

రంగారెడ్డి, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఒక పక్క ఇంటి అద్దెలు.. మరోపక్క పిల్లల చదువులు.. ఇంకో పక్క అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకానికి పెరిగిన నిత్యావసర, భగ్గుమంటున్న కూరగాయల ధరలు శరాఘాతంలా మారాయి. ఏడాది వ్యవధిలో కంది పప్పు ధర దాదాపు 50 శాతం పెరిగితే.. బియ్యం 13–25 శాతం వరకు పెరిగింది. నెల నెలా వచ్చే అరకొర జీతం అవసరాలకు సరిపోక అప్పుల పాలవుతున్న పరిస్థితుల్లో కుటుంబ నెల బడ్జెట్ తలకిందులవుతున్నది. జీవనాన్ని సాగించడం పెద్ద యుద్ధంగా మారిపోయిందని జిల్లాలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఆహార పంటల సాగు తగ్గడం.. వ్యాపారులు నిత్యావసరాలను అక్రమంగా నిల్వచేయడం ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తున్నది.



### ధరలు మరింత పైపైకి..

కొండెక్కిన పప్పులు.. భగ్గుమంటున్న కూరగాయలు.. మరుగుతున్న నూనెలు ఇలా మార్కెట్‌లో ధరల దరువు చుక్కలను తాకుతున్నది. పెరుగుతున్న నిత్యావసర ధరలతోపాటు అన్ని రకాల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. అసలే ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్న పేదలపై ధరల పెరుగుదల పెనుభారాన్ని మోపుతున్నది. పౌరసరఫరాల శాఖ చెబుతున్న లెక్కల ప్రకారం.. చక్కెర ధర కిలో 7 శాతం (రూ.39.09 నుంచి రూ.41.95కి), చింతపండు గ్రేడ్–1 రకం కిలోకు రూ.15.08 శాతం (రూ.118.50 నుంచి రూ.136.37), గ్రేడ్–2 రకం ధరలు 17.31శాతం (రూ.100.69 నుంచి రూ. 118.11కి) పెరిగాయి. సూపర్ ఫైన్ బియ్యం కిలో ధర ప్రస్తుత మార్కెట్‌లో రూ. 62, రూ.70గా ఉన్న ది. కిరాణా షాపుల్లో ఈ ధరలు మరింత అధికంగా ఉన్నాయి. ఉల్లిగడ్డలు గతేడాది డిసెంబర్‌లో కిలో రూ.27.19 ఉండగా..ఈ ఏడాది నవంబర్‌లో రూ. 46.97గా ఉన్నది. డిసెంబర్‌లో కాస్తంత తగ్గింది. అధికారులు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నది.

### సామాన్యులపై ఆర్థిక భారం..

నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతున్నది. మా ర్కెట్‌లో బియ్యం, పప్పులు, కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పెరిగిన ధరలతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ధరల పర్యవేక్షణ కమిటీ ప్రతి మూడు నెలలకొకమారు సమావేశాలు నిర్వహిస్తున్నామని ప్రకటిస్తున్నా ఫలితం లేదు. ధరలపై నియంత్రణ లేకపోతే వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

**-కొమ్ము ప్రసాద్, యువజన విభాగం నాయకుడు, ఆమనగల్లు**



**గతేడాది, ఈ యేడాది డిసెంబర్ మాసాల్లో కొన్ని నిత్యావసరాల ధరలు కిలోకు రూపాయల్లో ఇలా..**

| నిత్యావసరం | గతేడాది | ఈ ఏడాది | పెరుగుదల | పెరిగిన శాతం |
|---|---|---|---|---|
| బియ్యం | 43.26 | 48.90 | 5.64 | 13.04 |
| కందిపప్పు | 105.82 | 158.33 | 52.51 | 49.62 |
| మినపప్పు | 114.12 | 126.76 | 12.64 | 11.08 |
| పెసరపప్పు | 104.54 | 115.06 | 10.54 | 10.08 |
| ఉల్లిగడ్డ | 27.19 | 46.97 | 19.78 | 72.72 |

#### నేడు ఉత్తర ద్వార దర్శనం

### ముస్తాబైన అనంతపద్మనాభ ఆలయం

వైకుంఠ ఏకాదశికి మండలంలోని పెంజర్ల అనంతపద్మనాభస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయ పాలకవర్గ చైర్‌పర్సన్ అనితారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 6.48 గంటల నుంచి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులకు స్వామి వారి దర్శనానికి అనుమతి ఇస్తారు. మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని అనితారెడ్డి తెలిపారు.

**-కొత్తూరు, డిసెంబర్ 22**



#### షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు

## సబ్సిడీ ప్రోత్సాహకాలు అందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ భారతి హోలీకేరి

**రంగారెడ్డి కలెక్టర్ భారతి హోలీకేరి**

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 22 : షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు సబ్సిడీ ప్రోత్సాహకాలను అందించాలని రంగారెడ్డి కలెక్టర్ భారతి హోలీకేరి అన్నారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో టీఎస్ఐపాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీప్రైడ్ కింద షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు సబ్సిడీ ప్రోత్సాహంగా ఇచ్చే పథకాలు, అదేవిధంగా షెడ్యూల్డ్ తెగలు, దివ్యాంగులకు ఇచ్చే పథకాలపై సమీక్ష నిర్వహించారు. టీప్రైడ్, టీ ఐడియా పథకాల కింద షెడ్యూల్ కులాల లబ్ధిదారుల కేటగిరీలో ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులు.. అలాగే, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల కింద వచ్చిన దరఖాస్తులకు కమిటీ అనుమతులు ఇచ్చింది. ఇయా పథకాల కింద యూనిట్లు పొందిన లబ్ధిదారులు వాటిని నిరంతరం నడుపుకొనేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**హరితహారం లక్ష్యాన్ని పూర్తిచేయాలి..**

2024, 2025, 2026 సంవత్సరాలకు సంబంధించి హరితహారం భవిష్యత్ కార్యాచరణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ భారతి శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే మూడేండ్లకు ప్రభుత్వం హరితహారంలో జిల్లాకు నిర్దేశించే లక్ష్యాలను పూర్తిచేసేలా సంబంధిత శాఖల అధికారులు కృషిచేయాలన్నారు. ప్రతి శాఖకూ నిర్దేశించిన లక్ష్యాన్ని పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. మొక్కలను నాటేందుకు స్థలాలను గుర్తించడంతోపాటు గుంతల తవ్వకం పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, విద్యాశాఖల అధికారులు సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సుశీందర్‌రావు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

#### ధ్యాన జగత్ నిర్మాణమే

## పిరమిడ్ ట్రస్టు లక్ష్యం

**సుభాష్ పత్రీజీ కుమార్తెలు పరిమళపత్రీ, పరిణితీపత్రీ**





పిరమిడ్ ప్రధాన వేదికపై ధ్యానం చేస్తున్న ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ధ్యానులు

కడ్తాల్, డిసెంబర్ 22 : విశ్వమంతా ధ్యానం అందించడమే పిరమిడ్ ట్రస్టు లక్ష్యమని, ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పత్రీజీ కుమార్తెలు పరిమళపత్రీ, పరిణితీ పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం–2 శుక్రవారం రెండోరోజుకు చేరింది. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల సంగీత ధ్యానంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిమళపత్రీ, పరిణితీప్రతీ మాట్లాడుతూ ధ్యాన జగత్ నిర్మాణమే లక్ష్యంగా పిరమిడ్ సొసైటీ మూవ్‌మెంట్ పనిచేస్తున్నదన్నారు. కర్నూల్ జిల్లాలో చిన్న సొసైటీగా ప్రారంభమై నేడు గ్లోబల్ పీఎస్ఎస్ఎంగా అవతరించిందన్నారు. ప్రతి ఒక్కరికీ ధ్యానం నేర్పాలన్నదే సుభాష్ పత్రీజీ లక్ష్యమన్నారు. ధ్యానులు అందిస్తున్న సహకారం హర్షణీయమని పేర్కొన్నారు. అనంతరం పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నిత్య ధ్యాన సాధనతో మనిషిలో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ మహాసభలకు హాజరైన ధ్యానులకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ధ్యాన మహాయాగంలో సుభాష్ పత్రీజీ సందేశాలను వీడియోల రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో సభ్యులు రాంబాబు, శ్రీరాంగోపాల్, సాంబశివరావు, హనుమంతురాజు, బాలకృష్ణ, దామోదర్‌రెడ్డి, నవకాంత్, ఆనంద్, మాధవి, లక్ష్మి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.